ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
ఆదివారం | 25 జనవరి , 2026 | పేజీలు : 06

## కలకలం రేపుతున్న కోదాడ లేబర్ కార్యాలయంపై ఎసిబి దాడులు




**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ లేబర్ కార్యాలయంలో ఎసిబి అధికారుల దాడులు కలకలం రేపుతున్నాయి. ఎసిబి అధికారులు కార్యాలయంలో దస్త్రాలను, పలు రకాల ధృవీకరణ పత్రాలను స్వాదీనం చేసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కోదాడ పట్టణంలోని ఓ మీసే కేంద్రం వేదికగా చేసుకుని లేబర్‌కార్డుల జారీకి అవ కతవకలకు పాల్పడట్టు ఎసిబి అధికారులకు పక్కా సమాచారం అందడంతో ఎసిబి అధికారులు కార్యాలయంపై దాడి చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఏసిబి అధికారుల అక్రమ లావాదేవీలకు సంబంధించి అన్ని రకాల ఆధారాలు సేకరిస్తున్నట్లు సమాచారం. విచారణ కొనసాగుతుందని, పూర్తి సమాచారం వెల్లడిస్తామని అధికారులు పేర్కొన్నారు.

# చెర్వుగట్టు లింగన్న జాతరకు వేళాయే

### శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

### జాతర ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే వేముల వీరేశం





**ప్రజాపక్షం/నార్కెట్ పల్లి :** నల్లగొండ జిల్లా నార్కెట్ పల్లి మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో ఆరోగ్య క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీపార్వతీ జడల రామ లింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నగరోత్సవంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. కోరిన వారికి కొంగుబంగారంగా నిలిచిన శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం కనులారా వీక్షించడానికి రాష్ట్రంలోని నలు మూలల నుండి లక్షలాది భక్తులు విచ్చేయనున్న నేపథ్యంలో దేవాలయ శాఖ, పోలీస్ శాఖతో మమేకమై భక్తుల సౌకర్యార్థమై అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. పార్కింగ్ కోసం నార్కెట్ పల్లి నుంచి వచ్చే వాహనాలకు చెర్వుగట్టు గ్రామ శివారులో,ఎల్లారెడ్డి గూడెం నుంచి వచ్చే వారికి దారిలో,ఏపీ లింగోటం నుంచి వచ్చే వారికి గ్రామ శివారులో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు.అదేవిధంగా భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు కొనసాగిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. నార్కట్ పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ డిపో నుంచి ప్రతి 5 నిమిషాలకు ఒక బస్సు చొప్పున నడుపుతున్నట్లు పే ర్కొన్నారు. హైదరాబాద్,భువనగిరి నుంచినల్లగొండకు వచ్చే ప్రతి ఆర్డినరీ సర్వీసు చెర్వుగట్టు మీదు గా వెళ్లనున్నట్లు ఆర్‌టిసి అధికారులు తెలిపారు



**భక్తులకు ఇబ్బందులు కలగనీయం : ఎమ్మెల్యే వీరేశం**

బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. పలు ప్రదేశాల్లో భక్తులకు నీటి వసతి, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేసిన్నట్లు పేర్కొన్నారు.

**కట్టుదిట్టమైన భద్రత : సిఐ నాగరాజు**

చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ట్రా ఫిక్ ఇబ్బందులు లేకుండా జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ ఆదేశాల మేరకు డిఎస్పి శివరాం రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సిఐ కె నాగరాజు తెలిపారు. బ్రహ్మోత్సవాలు ముగిసేంతవరకు ఐదుగురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, మహిళా సిబ్బందితో కలిపి భద్రతా ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు. వాహనదారులు వారికి కేటాయించిన ప్రదేశాల్లో పార్కింగ్ చేసు కోవాలని కోరారు.దొంగతనాలు జరగకుండా నివారించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, గుట్ట పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్‌కి అనుసంధానం చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. భక్తులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైనా పోలీస్ కంట్రోల్ రూం డయల్ 100 కు సమాచారం.ఇవ్వాలని పేర్కొన్నారు.

**ప్రతి ఒక్కరూ కల్యాణాన్ని చూసేలా ఎల్‌సిడిలు ఏర్పాటు**

ఇఒ సల్వాది మోహన్ బాబు లక్షలాది భక్తులు ఎదురుచూసే శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి కల్యాణ వైభోగం వీక్షించడానికి సకల ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఈవో సిరికొండ నవీన్ కుమార్ తెలిపారు. స్వామివారి కల్యాణ వైభవాన్ని ప్రతి ఒక్కరు వీక్షించేందుకు ఘాట్ రోడ్లో, అక్కడక్కడ ఎల్‌సిడిలను ఏర్పాటు చేశామన్నారు. అత్యంత వైభవంగా జరిగే బ్రహ్మోత్సవాలకు 4 నుంచి 5 లక్షల మంది భక్తులు రానున్నారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా మంచి నీటి సౌకర్యం, పరిశుభ్రత, పారిశుద్యం పై కలెక్టర్ సమక్షంలో,నల్లగొండ ఆర్‌డిఓ పర్యవేక్షణలో జిల్లా అధికారుల సమన్వయంతో ఏర్పాట్లలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు.



## లోవోల్టేజ్ సమస్య పరిష్కారం

### తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** కరెంటు లోవోల్టేజ్ సమస్య పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శనివారం మండలంలోని కోటమర్తి గ్రామంలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోవోల్టేజ్ సమస్య పరిష్కారానికి సబ్ స్టేషన్ మంజూరు చేయించానని తెలిపారు. 3 కోట్ల 43 లక్షల వ్యయంతో సబ్ స్టేషన్ నిర్మాణం రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులకు చూచించారు. పూర్వం డిస్ మెటల్ లైన్లను మార్చి కొత్తలైన్లు వేసి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడి బాలునాయక్, డిఈ వెంకటేశ్వర్లు, ఎస్ఈ సురేష్, ఏఈ ఉమానాయక్, కాంగ్రెస్ పార్టీ మండలపార్టీ అధ్యక్షులు నిమ్మనగోటి జోజి, తహశీల్దార్ శేషగిరిరావు, సర్పంచ్‌లు పాశం విష్ణువర్ధన్, చిత్తలూరి సోమనారాయణ, రాజకొండ రమేష్, ముక్కాంముల శ్రీకాంత్, చేడే అంబెడ్కర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాశం సత్యనారాయణ, చిత్తలూరి సోమన్న, బొమ్మగాని లక్ష్మయ్య, వల్లంభట్ల రవిందర్ రావు, కంబాల వీరయ్య, చిత్తలూరి హనుమంతరావు, లింగాల నర్సిరెడ్డి పాల్గొన్నారు.

## కర్ల రాజేష్‌ది ముమ్మాటికి హత్యనే

### మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

**ప్రజాపక్షం/కోదాడ:** మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి దంపతుల కను సన్నులలో కోదాడ నియోజకవర్గంలో పోలిస్ గుండాల రాజ్యం వర్ధిల్లుతుందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. శనివారం దళితబిడ్డ రాజేష్ మరణం తీరుకు నిరసనగా బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో కోదాడ భారీ ర్యాలీ నిర్వహించిన ఆయన భావోద్వేగంతో ప్రసగించారు. రాజేష్ దుర్మరణం పాలై 68 రోజులు కావస్తున్నప్పటికీ ఇప్పటికే బాధ్యులైన పోలీసులను సస్పెండ్ చేయకపోవడం శోచనీయమన్నారు. పద్మశ్రీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ రాజేష్ పోలీసుల చిత్ర హింసలతో మరణించాడని ఆధారాలతో సహా నిరూపించినప్పటికీ అందుకు బాధ్యుడైన చిలుకూరు ఎస్ఐ సురేష్‌రెడ్డిని ఎందుకు సస్పెండ్ చేయలేదని ప్రశ్నించారు. తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కనుకనే సురేష్‌రెడ్డిని ఉత్తమ్ దంపతులు కాపాడుతున్న విషయం స్పష్టమైన అన్నారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ దళితుల ప్రాణాలంటే ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి గడ్డిపోచల ఉందని విమర్శించారు. ఆ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కాగా రాజేష్ తల్లి లలితమ్మ మాట్లాడుతూ తన బిడ్డకు జరిగిన అన్యాయం ఎవరికి జరగకూడదని, న్యాయం జరిగేదాక మీరంతా అండగా ఉండాలని కన్నీంటి పర్యంతమయ్యారు. ఈ ర్యాలీలో బిఆర్ఎస్ నాయకులు పయిడిమర్రి సత్యబాబు, ఎస్‌కె నయీం, సుంకర అజయ్‌కుమార్, కవితారెడ్డి, ఆరు మండలాల పార్టీ బాధ్యులు, వేలాది మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## యూరియా యాప్‌ను రద్దు చేయాల్సిందే

### రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురుజ రామచంద్రం

### రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి రాస్తారోకో


వివరాలు మెయిన్‌లో



## బిజెపి జెండా ఎగరాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని అత్యధిక స్థానాల్లో గెలిపించి హుజూర్‌నగర్ మున్సిపాలిటిలో బిజెపి జెండా ఎగురవేయాలని బిజెపి తెలంగాణ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని బిజెపి పట్టణ పార్టీ అధ్యక్షులు కొండా హరిష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయ సంకల్ప సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. బిజెపి నుండి పోటీ చేయనున్న అభ్యర్ధులకు పార్టీ కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూకల నర్సింహ రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి రుక్మారెడ్డి, బిక్షమయ్య, నాయకులు పాల్గొన్నారు.

## ఎస్ఐ సురేష్‌రెడ్డిని సస్పెండ్ చేసేంత వరకూ ఉద్యమం



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** కర్ల రాజేష్ లాకప్‌డెత్ కేసులో చిలుకూరు ఎస్ఐ సురేష్‌రెడ్డిని సస్పెండ్ చేసేంత వరకు ఉద్యమం ఆగదని గరిడేపల్లి మండల ఇన్‌ఛార్జి బండారి ఏసన్నమాదిగ(జోగులాంబ గద్వాల్ జిల్లా) డిమాండ్ చేశారు. కర్ల రాజేష్ మృతికి కారణమైన చిలుకూరు ఎస్ఐ సురేష్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేంత వరకు ఉద్యమం ఆగదన్నారు. ఫిబ్రవరి 5న చలో కలెక్టరేట్ ముట్టడిని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొత్తపల్లి రవి మాదిగ, పొలేపల్లి రాంబాబు, బరిగల సతీష్, కడప వీరస్వామి, వేణు పాల్గొన్నారు.

## దోమల మందు పిచికారీ

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** దోమల బెడద నివారణ కోసం సర్పంచ్ చెన్నగాని సాంబయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామంలో దోమల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తగా దోమల మందును శనివారం పిచికారి చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చెన్నగాని సాంబయ్య మాట్లాడుతూ దోమల బెడద నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కామళ్ల శ్రీకాంత్, తుళ్లూరి లుకాస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికలు ప్రతిభ చాటాలి

**ప్రజాపక్షం/మునగాల:** బాలికలు అన్ని రంగాల్లో రాణించి మంచి ప్రతిభ చాటాలని ప్రిన్సిపాల్ బూర సైదయ్యగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బాలికల జాతీయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలికల రక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకవచ్చిందని, వాటిని అవగాహన చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బిఎస్ గౌడ్, మహిళ ఉపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.



# విద్యతోనే బాలికల సంపూర్ణ అభివృద్ధి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్య ప్రతి ఒక్కరి ఆయుధమని ఆ ఆయుధం చేతిలో బాలికలు సంపూర్ణ అభివృద్ధి, సాధికారత సాధిస్తారని సీడీపీవో రేఖల మమత అన్నారు. శనివారం జాతీయ బాలిక సాధికారత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని గాంధీపార్క్ మండల పరిషత ప్రాథమికొన్నత పాఠశాలలో బాలికలకు ఆడపిల్లల రక్షణ, బాల్య వివాహాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం నెహ్రూనగర్ అంగన్‌వాడి కేంద్రంలో నిర్వహించిన ఇసీసీడే కార్యక్రమం కింద అంగన్‌వాడి కేంద్రంలో పిల్లలు విద్యను అభ్యసించడం వల్ల కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించార. కార్యక్రమంలో హెచ్ఎం కురువనాయక్, సూపర్‌వైజర్ నాగమణి, పోషన్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ కవిత, పీఈటీ కిరణ్‌ప్రవీణ్, అంగన్‌వాడి టీచర్లు రషీదాబేగం, కవిత, యాదమ్మ, లక్ష్మీ, పద్మజాదేవి, షాహిన్ మున్నీసాబేగం, బొందు పార్వతి, రామాంజమ్మ, లలితమ్మ, రజిత, హెల్పర్లు పాల్గొన్నారు.

# యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** యవతకు ఉపాది, ఉద్యోగాలు కల్పించడం కోసం వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. శనివారం ఆయన ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉపాది శిక్షణ శాఖ అధికారి ఎం.దానకిశోర్‌ను కలిసి వినతి పత్రం అందించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, జిల్లా కేంద్రంలో ఉన్న ఉపాధి కార్యాలయాలను మెరుగుపరిచి వాటి ద్వారా నిరుద్యోగులకు ఎప్పటికప్పుడు ఉపాది అవకాశాల సమాచారం ఇవ్వాలని కోరారు. యువతకు స్వయం ఉపాది కల్పించడంలో భాగంగా స్వయం ఉపాది కల్పించడానికి యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా నెలకొల్పాలని వాటి ద్వారా రాష్ట్రంలో ఉన్న యువతకు ఉపాది అవకాశాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాగుల కనకయ్యగౌడ్, పల్లె రాజశేఖర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

# బంజారా అఫిషియల్స్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బంజారా అఫీషియల్స్ క్యాలెండర్, డైరీని బకల్‌వాడి జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సంఘం నాయకులతో కలిసి మాట్లాడుతూ బంజారా సంస్కృతి, సాంప్రదాయాలను నేటి సమాజానికి తెలియచేస్తూ సమాజంలో ఉన్నత స్థితికి తీసుకెళ్లేందుకు బంజారా ఉద్యోగుల సంఘం పనిచేస్తుందని, దాదాపు రాష్ట్రంలో ఉన్న బంజారా ఉద్యోగులందరు ఇందులో భాగస్వామిగా ఉండి చేసే కార్యక్రమాలపై అందరు కూడా తమ వంతు బాధ్యతగా నిర్వర్తిస్తూ మందుకు వెళ్లాలని కోరారు. అదేవిధంగా ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన ధీరావత్ ధర్మానాయక్‌ను బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకుల మక్లానాయక్, దాశివా, బాలు, నీలియా, నెహ్రూ, సైదానాయక్, దేవి, శ్రీను, రాంబాబు, పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి బస్సులో ప్రయాణం సురక్షితం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఆర్‌టిసి బస్సులో ప్రయాణం సురక్షితమని ఇదే ప్రజా రవాణా సంస్థ (ఆర్‌టిసి) యొక్క నినాదమని సూర్యాపేట ఆర్‌టిసి డిపో మేనేజర్ ఊట్కూరి సునీత అన్నారు. శనివారం డ్రైవర్స్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి డ్యూటికి వెళ్తున్న డ్రైవర్లకు గులాబీపువ్వులు, అరటిపండ్లు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆర్‌టిసి డ్రైవర్లు సమాజ సేవకులుగా గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. వారు పోషిస్తున్న పాత్ర గొప్పదన్నారు. అంతేకాక నిర్ణీత సమయానికి ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేరవేర్చే శక్తి వారికి ఒక్కరికే ఉందని ఖితాబు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి అసిస్టెంట్ మేనేజర్ సైదులు పాల్గొన్నారు.



## ఐద్వా జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** అఖిలభారత ప్రజాతంత్ర మహిళ సంఘం జాతీయ మహాసభల సందర్భంగా బాలిక దినోత్సవం సందర్భంగా మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు మేకల నాగేశ్వర రావు కోరారు. శనివారం మండల పరిధిలోని వెలిదండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐద్వా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన బెలూన్లు ఎగురవేసి మహాసభకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళ సంఘం జిల్లా నాయకులు యా నాల సుశీల, సర్పంచ్ చెనగాని సాంబయ్య, ఉప సర్పంచ్ యానాల సోమయ్య, ఉపాధ్యాయులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



## మూఢాచారులతో భవిష్యత్‌ను కోల్పోవద్దు

**ప్రజాపక్షం/మోతె :** గ్రామాలలో మూఢాచారాలతో బాలలు భవిష్యత్‌ను కోల్పోవద్దని ఎంపిడిఓ తిప్పని ఆంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని నామవారం, రాఘవాపురం గ్రామాలలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటికి గ్రామాలలో చట్టాలపైన కనీస అవగాహన లేదని బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని అన్నారు. మైనర్ల పెళ్ళిలకు చాటుమాటుగా చేసిన పరోక్షంగా, ప్రత్యక్షంగా సహకరించినా చట్టం పరిధిలో శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు దైద శ్రవణ్, మద్ది మంజుల, భాస్కర్ రెడ్డి, ప్యారా లీగల్ వాలెంటరీలు గుద్దేటి వెంకన్న, పల్లెల లక్ష్మణ్, యస్ కృష్ణవేణి పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** రాష్ట్ర నీటిపారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో శనివారం మండల పరిధిలోని ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు మీసాల యోహను, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీతరామిరెడ్డి లు లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులు బొలగాని సైదమ్మ, చిలకమర్రి సరిత, నూకల వెంకట రెడ్డి, మహేశ్వరరావు, మీసాల లక్ష్మి నారాయణ లకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కందుకూరి కృష్ణారెడ్డి, ఆరె కృష్ణారెడ్డి, అమరారపు నవీన్, గుణగంటి వెంకటమ్మ, వెంకన్న, అనంతు సరిత, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## రక్షణ చట్టాలపై అవగాహన అవసరం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** బాలికలు వారి కోసం ప్రభుత్వాలు ఏర్పరిచిన రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ అన్నారు. హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ బాలిక దినోత్సవం, జాతీయ ఓటర్ల దినోత్సవం (మాక్ పోలింగ్), ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ వంటి కార్యక్రమాలను రాజనీతిశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ రామారావు మాట్లాడుతూ బాలిక్ల హక్కులు సద్వినియోగం చేసుకోవాలని, యువతకు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐకాక్ క్యూ ఎసి కోఆర్డినేటర్ ప్రియాంక, ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ నగేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరికలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పట్టణంలో భారతీయ జనతా పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని 10వ వార్డు యూత్ కాంగ్రెస్ నాయకులు మర్రి చంటి, కనుకు రవి, 40వ వార్డు నుండి వీరవెల్లి ఉమలు శనివారం బిజెపి రాష్ట్ర నాయకులు, మాజీ శాసనసభ్యులు సంకినేని వెంకటేశ్వర రావు సమక్షంలో బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన నూతనంగా పార్టీలో చేరిన నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, బిజెపి నాయకులు రంగరాజు రుక్మారావు తదితరులు పాల్గొన్నారు.





## వందేమాతరం సంబురాలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వందేమాతరం 150 ఇయర్స్ సెలబ్రేషన్స్‌ను శనివారం వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సమ్మిడి వీరారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వన్ టౌన్ సీఐ నాగభూషణం, హోమియోపతి వైద్యుడు పానగంటి పుష్పలత, రిటైర్డ్ ఉపాధ్యాయుడు నందికొండ చంద్రయ్యలు జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వందేమాతరం విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో గూడూరు శ్రీనివాస్, అంకినపల్లి సుధాకర్, రేపాల పురుషోత్తం, కన్మంతరెడ్డి, హన్మంతరెడ్డి, ప్రీతం రాజు, వినోద్ పాల్గొన్నారు.

## సామాజిక మాధ్యమం మాయలో పడొద్దు




**ప్రజాపక్షం/నకిరేకల్ :** సామాజిక మాధ్యమం మాయలో పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఐసిడిఎస్ సిడిపిఓ అస్రాఅంజుమ్ పేర్కొన్నారు.శనివారం జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు.అనంతరం విద్యార్థినీలకు బాల్య వివాహాలు,సామాజిక మాధ్యమం,డిజిటల్ వయోలెన్స్ తదితర అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈపోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమణమ్మ,ఐసిడిఎస్ సూపర్వైజర్ సునీత,అంగన్వాడి టీచర్ కమల,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** ఆరైవ్ ఆలైవ్ రోడ్డు భద్రత 2026 కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పోలీసులు శ్రీక్రాంతి జూనియర్ కళాశాల, డిగ్రి కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగ పోలీస్ వారు మాట్లాడుతూ వాహనాలపై ప్రయాణాలు చేసేటప్పుడు హెల్మెట్, సీటు బెల్ట్ కచ్చితంగా ధరించాలని విద్యార్థులకు సూచించారు. చిన్న నిర్లక్ష్యంతో కుటుంబాలు రోడ్డు మీద పడతాయని, డ్రైవింగ్‌లో అలసత్వం వహించకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. ఈకార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్స్ నవీన్‌రెడ్డి, నజీరుద్దీన్, తిరుపతయ్య, శ్రీక్రాంతి డిగ్రి కళాశాల ప్రిన్సిపల్ గుంటోజు ఆంజనేయులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దుండిగళ్ల అశోక్, ఏవో గోవర్ధన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# నిత్య యోగా సాధన ఆరోగ్యానికి మేలుకరం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఆరోగ్య జీవన విధానమే ప్రకృతి వైద్యం అని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహారావు నేత అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా ప్రభుత్వ ఆయుష్ శాఖ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర నేచర్ క్యూర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ జీవన అలవాట్లను పెంపొందించడమే కాక నిత్య యోగ సాధన వ్యాయామం అలవాటు చేసుకోవడం ద్వారా ఆనందంగా ఆరోగ్యంగా జీవించవచ్చని అన్నారు. యోగా ప్రాణాయామాల ద్వారా శారీరక మానసిక దృఢత్వం మెరుగవుతుందని, మసాజ్ తెరఫీ ద్వారా శరీరానికి రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ నగేష్,ఆయుష్ శాఖ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుహాసిని, ఆర్ఎంవోలు రజిని,కిరణ్, తులసి, మహేష్, స్వప్న,ఎన్ఆర్‌హెచ్ఎం డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి,డాక్టర్లు యశస్విని,రుచిత హౌస్ సర్జన్లు,డిపిఎంలు కేతన్,కళ్యాణ్, సిబ్బంది చంద్రయ్య,విజయలక్ష్మి,మెర్సి, యోగా ఇన్స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్లమోతు సిద్దార్ధ అన్నారు. కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షురాలు మంద పద్మావతి తన అనుచరులతో కలిసి మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, 35వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి దైద సత్యం సమక్షంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సిద్దార్ధ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆచరణకు సాధ్యం కాని హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. మిర్యాలగూడ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుకే దక్కిందన్నారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు అధికమయ్యాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మగ్దుంపాషా, పి.శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, షోయబ్ తదితరులు పాల్గొన్నారు.

## హన్మంతు చంద్రన్న 21వ వర్ధంతికి ఘన నివాళి..



**ప్రజాపక్షం/దేవరకొండ;** దివంగత కార్మిక నాయకుడు ప్రజల మనిషి దేవరకొండ మాజీ సర్పంచ్ స్వర్గీయ హన్మంతు చంద్రన్న 21వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చంద్రన్న స్మారక కాంస్య విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవరకొండ మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన తాటికోల్ జెడ్పిహెచ్ఎస్ విద్యార్థి ఎండి. ఫర్హాన్‌కు చంద్రన్న గోల్డ్ మెడల్ ప్రతిభా పురస్కారంగా రూ. 50వేల నగదుతో పాటు గోల్డ్ మెడల్, పాఠశాలకు షీల్డ్‌ను అందజేశారు. అనంతరం కోదండ రామాలయంలో అన్నదానం నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, చంద్రన్న అభిమానులు చంద్రన్న సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో చంద్రన్న కుమారులు హన్మంతు వెంకటేష్‌గౌడ్, హన్మంత్ శ్రీనివాస్ గౌడ్, హన్మంత్ రాఘవేందర్‌గౌడ్, చంద్రన్న అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ యూనివర్సిటీలో అధ్యాపకులకు వర్క్‌షాప్



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం,బీస్ హైదరాబాద్ ఎంజియు అధ్యాపకులకు ప్రాజెక్టు ప్రతిపాదనల రచన పై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు.శనివారం యూనివర్సిటీలో సైన్స్ కళాశాల వేదికగా జరిగిన కార్యక్రమానికి బీస్ సంస్థ ప్రతినిధులు ఆచార్య నండూరి సత్యనారాయణ డా శ్రీనివాసమూర్తి ముఖ్య అతిథులుగా హాజరై పరిశోధన ప్రతిపాదనల తయారీ విధానం మెలకువలు అధ్యాపకులతో చర్చించారు.100 కోట్ల భారతావనిలో ఉన్నత విద్య సంస్థల నుండి మేలైన పరిశోధనలు రావాలని విశ్వవిద్యాలయ కేంద్రంగా మరిన్ని సవాళ్లకు పరిష్కారాలు అందించాలని తెలిపారు. అనంతరం అధ్యాపకులు రూపొందించిన ప్రతిపాదనలపై చర్చించి తగు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వసంత ఇంజనీరింగ్ కళాశాల అడ్జన్ట్ ప్రొఫసర్ సాంబశివరావు,డాక్టర్ వై ప్రశాంతి,డాక్టర్ మాధురి, డాక్టర్ రామచందర్ గౌడ్, డాక్టర్ కళ్యాణి తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

## చిన్నారికి ఆశీర్వాదం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు కౌన్సిలర్ చెవుగోని రాములమ్మసైదులు మనుమడి జన్మదిన వేడుకలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దైద రవీందర్ కూడాపాల్గొనిఆశీర్వదించారు.ఈకార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్ వైస్ చైర్మన్ మూరారిశెట్టి ఉమారాణి కృష్ణ మూర్తి, కౌన్సిలర్స్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నేటి నుంచి రథసప్తమి వేడుకలు

**ప్రజాపక్షం/అర్వపల్లి :** నేటి నుండి మండలంలోని తిమ్మాపురం సమీపంలో నిర్మించిన అఖండ జ్యోతి స్వరూప శ్రీసూర్యనారాయణ స్వామి దేవాలయంలో రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు కాకులారపు రజితాజనార్ధన్ స్వామి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం 4 గంటలకు స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకము, అలంకరణ, 5.30 గంటల నుంచి స్వామి వారి దర్శనం, 9.30 గంటలకు భజన కార్యక్రమాలు, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5 గంటలకు ఉషా, పద్మిని, ఛాయా సమేత శ్రీ సూర్య నారాయణ స్వామి కళ్యాణం జరుగుతుందన్నారు. రథ సప్తమి సందర్భంగా ఆదివారం సూర్యాపేట కొత్తబస్టాండ్ నుండి సూర్య దేవాలయానికి ప్రతి పది నిమిషాలకు ఒక బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు ఆర్‌టిసి అధికారులు తెలిపారు. వేడుకల సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

## అంగన్‌వాడీ కేంద్రాల సద్వినియోగం



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే బాలామృతం, మధ్యాహ్న భోజనం, ఎగ్ బిర్యాని, గుడ్లు, పాలు, మురుకులను చిన్నారులు, బాలింతలు, గర్భిణిలు సద్వినియోగం చేసుకోవాలని కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన బాలల పరిరక్షణ కమిటి సమావేశంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డాకునాయక్, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, నాగమణి, ఆయా హసిన, వైద్య సిబ్బంది, చిన్నారులు, బాలింతలు, గర్భిణిలు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు వ్యాసరచన పోటీలు



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** జాతీయ బాలిక ల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.శనివారం స్థానిక జెడ్పిహెచ్‌ఎస్ హైస్కూల్ బాలికలకు చైల్డ్ మ్యారేజ్,సేవ్ ది చైల్డ్, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్స్ ఆన్ గర్ల్ చైల్డ్,సైబర్ బులీయింగ్,డిజిటల్ విఓలెన్స్ ఆన్ గర్ల్స్ అబొవ్ అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈపోటీలో మంచి ప్రతిభ చూపించిన పిల్లలకు బహుమతులు అందించారు.మొదటి బహుమతి నసారా తబస్సుమ్, రెండవ బహుమతి గాయత్రి,మూడవ బహుమతిచైత్రిని లు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిహెచ్‌ఎస్ ప్రిన్సిపాల్ రాములు,ఉపాధ్యాయులు, అంగన్వాడి సూపర్వైజర్ సరిత,గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

## మహాసభలను జయప్రదం చేయాలి



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** జనవరి 25 నుండి 28 వరకు హైదరాబాద్‌లో జరగనున్న ఐద్వా 14వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి తంగిరాల సైద మ్మ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఐద్వా జెండా ఆవిష్కరణ చేశారు. ఈకార్యక్రమంలో సైదమ్మ, ఫాతిమ, మల్లిక, తిరుమల, లక్ష్మ మ్మ పాల్గొన్నారు.



## అభివృద్ధి దిశగా కట్టకొమ్ముతండా

**ప్రజాపక్షం/దేవరకొండ;** నిత్యం అభివృద్ధి కార్యక్రమాలతో కట్టకొమ్ముతండా గ్రామ పంచాయతీ అభివృద్ధి దిశగా సాగుతుంది. శనివారం తాగునీటి సమస్యతో పాటు విద్యుత్ సరఫరా సమస్యలపై గ్రామ ప్రజలతో సర్పంచ్ నేనావత్ జ్యోతిపాండునాయక్ చర్చించారు. వడ్డెర బస్తీలో ప్రజలకున్న సమస్యలను మాట్లాడారు. దేవరకొండ ఎంఎల్ఏ బాలునాయక్ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం తమ బాధ్యత అని సర్పంచ్ స్పష్టం చేశారు. వేసవిలో పిల్లలు చెరువులోకి వెళ్లకుండా తల్లి దండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** అయిటిపాముల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న ఎస్.కె. ఖలీల్ అనారోగ్యంతో ఆరు నెలల క్రితం మృతి చెందగా, ఆయన కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాలేదని తెలుసుకున్న1996/97 పూర్వ విద్యార్థుల బృందం సభ్యులు నల్లగొండ కతాల్‌గూడలోని ఆయన నివాసానికి వెళ్లి భార్య రజియా సుల్తానా,కుమార్తెలు సోఫియా, హాఫియాలకు రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇటికల సురేందర్, రెడ్డబోయిన దామోదర్, మేడి రామలింగయ్య పాల్గొన్నారు.

## పోషణపై వ్యాసరచన పోటీలు



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** సీనియర్ సిటిజన్స్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో అడ్డగూడూరులో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. వయోవృద్ధుల పోషణ సౌంరక్షణ అనే టాపిక్ పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి యం.మధు పదవ తరగతి, రెండవ బహుమతి జి.ధనశ్రీ తొమ్మిదవ తరగతి, మూడో బహుమతి ఎండి.అమీనా తొమ్మిదవ తరగతి గెలుచుకున్నారు. గెలిచిన వారికి డిక్షనరీస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.సబిత, హెచ్ఎం పి.వెంకటాద్రి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/వలిగొండ ః** వలిగొండ పట్టణ కేంద్రానికి చెందిన సూరారం రాములు గత కొద్దిరోజుల క్రితం మరణించారు. సమాచారం తెలిసిన వెంటనే వారి దిన కర్మలకి వారి కుటుంబ సభ్యులకు జంగారెడ్డి సహకారంతో రూ.5000 అందజేశారు.



# ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంను సద్వినియోగం చేసుకోవాలని భువనగిరి మండల వైద్యాధికారిని డా. యామిని శ్రుతి అన్నారు. భువనగిరి మండలంలోని తాజ్‌పూర్‌లో గ్రామ ప్రజల ఆరోగ్య సమస్యలకు అందుబాటులో ఒక ఆరోగ్య కేంద్రం ఉండాలన్న ఆలోచనతో మన గ్రామ సామాజిక వేత్త డా.ర్యాకల శ్రీనివాస్ జిల్లా వైద్యాధికారులను సంప్రదించి వారి స్వంత ఖర్చులతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరము పేరిట ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గ్రామ ప్రజల సౌకర్యార్థం బొల్లెపల్లి వైద్య బృందం ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొని



వారి ఆరోగ్య సమస్యలకు గాను పరీక్షలు చేయించుకుని అవసరమైన మందులను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్, ఉపసర్పంచ్, గ్రామపంచాయతి పాలకవర్గం, సిబ్బంది, గ్రామ పెద్దలు, యువత, అంగన్వాడీ, ఆశ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రిపబ్లిక్ డే వేడుకలలో అంబేద్కర్ ఫోటో పెట్టాలి

**ప్రజాపక్షం/వలిగొండ ః** రిపబ్లిక్ డే వేడుకలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫోటో పెట్టాలని సామాజిక కార్యకర్త మలిదశ ఉద్యమకారుడు సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం జరిగినప్పుడే అందరికీ సమాన అవకాశాలు దక్కుతాయని భావించిన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని పేర్కొన్నారు. సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్రం రాజ్యాన్ని నిర్మించాలని రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులపాటు శ్రమించి, ఎన్నో నిద్రలేని రోజులు గడిపి భారత రాజ్యాంగాన్ని లిఖించారని, తాను రాసిన రాజ్యాంగ రచనలను 1949 నవంబర్ 26న సమర్పించారని, 1950 జనవరి 26న రాజ్యాంగాన్ని అమలులోకి తెచ్చిన రోజు కాబట్టి రిపబ్లిక్ డే జరుపుకుంటున్నామని తెలిపారు. కానీ ప్రస్తుతం అంబేద్కర్ చేసిన సేవలను స్మరించుకోకుండా, రిపబ్లిక్ డే సందర్భంగా కనీసం ఆయన ఫోటోను కూడా పెట్టకుండా మర్చిపోతున్నారని మండిపడ్డారు. రిపబ్లిక్ డే సందర్భంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రత్యేక జీవో జారీ చేసి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అంబేద్కర్ ఫోటో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.

# ఒక్క చెట్టునుకొట్టేస్తే, ఇరవై చెట్లు నాటిస్తా



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** అకారణంగా ఎవరు చెట్లను నరికినా, గ్రామపంచాయతీ పర్మిషన్ లేకుండా చెట్లు తొలగించిన వారికి పనిష్మెంట్‌గా ఒక్క చెట్టుకు బదులుగా ఇరవై చెట్లు వారితోనే నాటిస్తా అని గోపాల్‌పురం సర్పంచ్ పుట్ట సాయిలు హెచ్చరించారు. తుర్కపల్లి మండలంలోని గోపాల్‌పురం గ్రామంలో విద్యుత్ సరఫరా కోసం చెట్టును కొట్టివేసిన విద్యుత్ అధికారి చేత, గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో రెండు చెట్లు నాటించి సమాజానికి కూడా ఒక మంచి సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుట్ట సాయిలు ముదిరాజ్ మాట్లాడుతూ అటు పర్యావరణాన్ని, ప్రకృతి నాశనం చేసే పనులు ఎవరు చేసిన ఉపేక్షించేది లేదని, ఒక్క చెట్టుకు బదులు 20 చెట్లు నాటాలి, నిర్లక్ష్యంగా చెట్లను తొలగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. గ్రామాభివృద్ధిలో గ్రామ ప్రజలతో పాటు సంబంధిత అధికారుల సహకారం కూడా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ క్రీడోత్సవాలు ప్రారంభం

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండల కేంద్రంలో క్రీస్తుశేషులు కత్తుల లింగరాజు యాదవ్ జ్ఞాపకార్థకంగా తనతో పాటు చదువుకున్న 2016/17 పదవతరగతి బ్యాచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ద్వితీయ కబడ్డీ క్రీడోత్సవాలను అడ్డగూడూరు ఎంఈఓ సబిత శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కబడ్డీ నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 24 నుండి 26 వరకు కబడ్డీ క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్డగూడూరు సర్పంచ్ పూజరి వనజ సైదులు, ఎంపీఓ ప్రేమలత, ఉప సర్పంచ్ వరిగడ్డి లోకేష్, బైరెడ్డి సందీప్ రెడ్డి, కడారి రమేష్, గజ్జల్లి రవి,షేక్ సమీర్, పయ్యావుల రమేష్, దాసరి బాలరాజ్, గుజ్జ మత్యగిరి, మహేష్, భరత్, కబడ్డీ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



## బలగం కొమురయ్యను కలిసిన సర్పంచ్

**ప్రజాపక్షం/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామంలో గల గడీల బడిలో షార్ట్ ఫిలిం షూటింగ్ కోసం వచ్చిన బలగం సినీ నటులు బలగం కొమరయ్యను గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి షూటింగ్ కోసం వచ్చే కళాకారులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నల్ల జయసుధ స్వామి, వార్డు మెంబర్లు యువ నాయకులు సింగనబోయిన గణేష్ యాదవ్, కళాకారులు మంటి లింగస్వామి, సీనియర్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలంలోని తాటికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా జరిగింది.ప్రధానోపాధ్యాయులుగా పొల్లెగోని నాగసాయి,విద్యాశాఖ మంత్రిగా మన్నెం భాను,ఎమ్మెల్యేగా ముచ్చపోతుల కిరణ్,కలెక్టర్‌గా సంజన,అడిషనల్ కలెక్టర్‌గా సుంకర బోయిన లోకేష్,డీఈవోగా కారింగు ఇందు,డిప్యూటీ డిఇఓగా హిమ వర్షిని,మండల విద్యాధికారిగా కావ్య పాత్రలను పోచహించారు. ముగింపు సమావేశంలో ఎంఈఓ మేక నాగయ్య మాట్లాడుతూ విద్యార్థులలో ఆత్మవిశ్వాసం నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి స్వపరిపాలన కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్ పార్వతి,ఉపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న, పండుగ తిరుమలయ్య, మోసంగి హరీష్ చంద్ర, మార్త రాములు, డాక్టర్ సాగర్ల సత్తయ్య పాల్గొన్నారు.

## ఓటరు దినోత్సవం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటర్ల చైతన్యం అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నకిరేకల్ ప్రధానాచార్యులు డాక్టర్ బెల్లి యాదయ్య అన్నారు. కళాశాల రాజనీతిశాస్త్ర విభాగం నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్, హరితలు ఓటరు చైతన్యంపై మాట్లాడగా రాజనీతిశాస్త్ర విభాగం అధ్యాపకులు మధుసూదన్ రెడ్డి అనుసంధానకర్తగా వ్యవహరించారు.అధ్యాపకులు శంకర్, రవీందర్, నర్సింహాచారి,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయికి ఎంపికైన ప్రభుత్వ జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థి



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** 69వ ఎస్‌జిఎఫ్ఐ రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు ఈనెల 21 నుండి 23 వరకు నిజామాబాద్ జిల్లా కమ్మరపల్లిలో జరిగినాయి. ఈ పోటీలో జిల్లా పరిషత్ హై స్కూల్ బస్వాపూర్ పాఠశాల విద్యార్థి ఏషాల అజయ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయులు ఎండి జాకీర్ బాబా తెలిపారు. విద్యార్థి ఫిబ్రవరి 4 నుండి 8 వరకు చత్తీస్గడ్ రాష్ట్రం బిలాస్పూర్‌లో జరగనున్నాయి. జాతీయస్థాయికి ఎన్నికైన అజయ్‌ని గ్రామ సర్పంచ్ మచ్చ బిక్షపతి గౌడ్, ఉపసర్పంచ్ సామల వినయ్, వార్డు సభ్యులు గ్రామ పెద్దలు పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పిఈటి వీరేశం అభినందనలు తెలియజేశారు.

## ఉచిత పశువైద్య శిబిరం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో తుక్కాపూర్‌లో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరంను గ్రామ సర్పంచ్ జనగాం పాండు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రత్యూష, వైద్యులు రజిత, గోపాలమిత్ర సూపర్వైజర్ గిరిబాబు, ఉప సర్పంచ్ రాసాల లింగస్వామి యాదవ్, వార్డు మెంబర్‌లు రైతులు పాల్గొన్నారు.





## భాస్కర్ రావుకు శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ఇటీవల ఐఏఎస్‌గా పదోన్నతి పొందిన జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ను(స్థానిక సంస్థలు) జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మందాడి ఉపేందర్ రెడ్డి, జిల్లా ఎంపీడీవోల అధ్యక్షులు ఎన్.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వివిధ మండలాల ఎంపీడీవోలు, అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సమ్మె జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్తంగా జరగనున్న సార్వత్రికసమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ మంచాల మధు పిలుపునిచ్చారు. శనివారం పోచంపల్లి మండల పరిధిలోని జిబ్లక్పల్లిలోని శ్రీ సాయి మెటల్ ఇండస్ట్రీస్ యజమాన్యానికి దేశవ్యాప్త సమ్మె నోటీసును ఇచ్చినట్లు తెలిపారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్మికుల హక్కుల మీద దాడి చేసే విధంగా కార్మిక చట్టాలను మార్చి కార్మిక కోడులను తీసుకువచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గోపనగోని నరసింహ యాదవ్, నాగిల్ల బాలయ్య, చిలువేరు గణేష్, రవీందర్ రెడ్డి, యాదయ్య, సత్తయ్య, మల్లయ్య చారి, గలయ, లింగస్వామి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## బోరు మోటార్ల స్టాటర్ల అపహరణ

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** బోరు మోటార్ల సాటర్ల అపహరణకు గురైన సంఘటన శనివారం వీరవెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం భువనగిరి మండలంలోని వీరవెల్లి గ్రామంలో కంచి మల్లయ్య, కళ్లెం రఘుపతి రెడ్డిలకు సంబంధించిన మోటార్ చాటర్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకపోయారు. మోటార్ సాటర్లు మూడు ఫీజులకు సంబంధించి మొత్తం రూ.6000 నష్టం జరిగినట్లు తెలిపారు. ఇద్దరికీ కలిపి 12000 నష్టం జరిగింది. ఈ విషయంపై భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు రైతు సమన్వయ సమితి మాజీ మండల కన్వీనర్ కంచి మల్లయ్య తెలిపారు.

## దాతల సహకారం మరువలేనిది

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాల (గడీలబడి)లోని విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉండాలన్న సర్పంచ్ గర్దాస్ విక్రమ్ కోరిక మేరకు ధాతలు సింగనబోయిన యశోద జ్ఞాపకార్థం వారి కుమారుడు సింగనబోయిన కరుణాకర్ యాదవ్, 35 మంది విద్యార్థులకు టై, బెల్ట్, షూస్ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, వార్డ్ మెంబెర్లు, యువనాయకులు సింగనబోయిన గణేష్ యాదవ్, సీనియర్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# 200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాపక్షం/చండూరుః నల్లగొండ జిల్లా చండూరు మండలం కస్తాల గ్రామంలో శనివారం నార్కట్‌పల్లి కామినేని హాస్పిటల్ వారు గ్రామంలోని ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు కావలసిన మందులను అందజేశారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ లేదన్న సత్యనారాయణ ప్రారంభించి మాట్లాడుతూ కామినేని హాస్పిటల్ వారు కస్తాల గ్రామంలోని ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి 200మంది రోగులకు కావలసిన మందుందులను కూడా ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. అలాగే కంటి ఆపరేషన్ తో పాటు ఇతర ఆపరేషన్‌లు కోసం మంగళవారం ఆస్పత్రి బస్సు ద్వార రోగులను ఆసుపత్రికి



తీసుకెళ్లి ఉచితవైద్యం అందజేస్తామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కట్ట స్వర్ణ నర్సింహ్మా, సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు గంట రమేష్ , కట్ట యాదగిరి, సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి జోగు రమేష్ మదిరాజ్, కామినేని వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# లింగోటంలో సిసి కెమెరాల ఏర్పాటుకు విరాళం



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** గ్రామంలో నేరాలు జరుగకుండా, శాంతి భద్రతలకై సీసీ కెమెరాలు ఏర్పాటుకు ధాత నుండి విరాళం సేకరించారు శనివారం మండలం పరిధిలోని ఏ పి లింగోటం గ్రామ పంచాయతీ పాలకవర్గం గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించగా అందుకు గాను దాతలను కోరగా గ్రామానికి చెందిన ఉగ్గేపల్లి నర్సింహా ముందుకు వచ్చి రు.6వేలు గ్రామ సర్పంచ్ పనస సరోజకు అందించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పనస సరోజా వెంకటయ్య మాట్లాడుతూ వారిని అభినందించి గ్రామంలోని పెద్దలు, యువకులు ఇలాంటి మంచి కార్యక్రమాలకు ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొరివి శంకర్,వార్డు సభ్యులు దాసరి రమాదేవి సైదులు, ఏరుకొండ వేణు,గ్రామ పెద్దలు కొత్తపేట రఘుమాచారి,పాలకూరి శేఖర్,పంజాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల అమ్మకం, ప్రైవేటీకరణ, కార్పోరేటీకరణ, కమర్షలైజేషన్ విధానాలను తూచా తప్పకుండా అమలు చేస్తూ తీసుకవచ్చిన నాలుగు లేబర్‌కోడ్లను రద్దు చేసేంత వరకు వాటికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీని నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఆత్మనిర్భర్‌లో భాగంగా కార్మిక వర్గానికి కొత్త హక్కులను కల్పిస్తూ లేబర్ కోడ్‌ను తీసుకొస్తున్నారని అన్నారు. ఫిబ్రవరి 12న లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా జరిగే దేశ



వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ జనార్థన్, జిల్లా అధ్యక్షులు కామల నవీన్, నాయకులు సైదులు, జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలను పరిశీలించిన ఎఇ



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని ముష్టిపల్లి గ్రామంలో ఉన్నటువంటి విద్యుత్ సమస్యలను సర్పంచ్ జక్కుల మంజుల మల్లయ్య మండల విద్యుత్ అధికారి శివప్రసాద్ రెడ్డికి వివరించారు.గ్రామంలోని కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్‌సబ్ స్టేషన్ తో కరెంట్ సమస్యలు వస్తుండడంతో సమాచారం తెలుసుకున్న మండల విద్యుత్ అధికారి శివప్రసాద్ రెడ్డి శనివారం గ్రామాన్ని సందర్శించి గ్రామంలో ఉన్న సబ్ స్టేషన్ అన్ని ట్రాన్స్ ఫారాలను,స్తంభాలను పరిశీలించారు. అవసరం ఉన్న చోట కొత్త స్తంభాలను వేయాలని సూచించారు,ఇండ్ల మధ్యలో ఉన్నటువంటి ట్రాన్స్ ఫారాలను దూరంగా నిర్మించాలని సూచించారు. ఇండ్లల్లో వస్తున్న కరెంట్ ఎచ్చు,తగ్గుల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి,గ్రామంలో విద్యుత్ సమస్యలు లేకుండా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బుషిపాక పెద్ద ఈదయ్య, లైన్మెన్ కల్లాల వెంకటరెడ్డి,వేణు,లైన్ ఇన్ స్పెక్టర్ సాయిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ అండేకర్ రమేష్ ,వార్డు మెంబర్ గురేష్,మాజీ సర్పంచ్ గుండ్ల అంజయ్య, బొల్లంపల్లి విష్ణుమూర్తి,గిరి వెంకటేశ్వర్లు ఉన్నారు.

## సీలింగ్ ఫ్యాను, పలకలు అందజేత

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని వెంకటాపురం గ్రామంలోని అంగన్వాడి సెంటర్‌కు గ్రామ వార్డ్ మెంబర్ పల్లెపాటి అనిల్ కుమార్ సీలింగ్ ఫ్యాన్, పిల్లలకు పలకలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రే మాధవి కరుణాకర్ గౌడ్, ఉప సర్పంచ్ ఉదయ్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ మహేందర్, అంగన్వాడీ టీచర్ నారా స్వప్న,



గ్రామస్తులు నార నాగరాజు కొడపాక అక్షిత, మహేశ్, వనజమ్మ తదితరులు పాల్గొన్నారు.



## బోరు మోటర్‌కు మరమ్మతులు

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ పట్టణ కేంద్రంలోని పదో వార్డులో మారెమ్మ ఆలయం ముందు గత కొన్ని నెలలుగా నిరుపయోగంగా బోరు మోటర్ పాడై ఉండడంతో వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎన్నికల సమయంలో వార్డు ప్రజలకు పదో వార్డు సభ్యురాలు పబ్బు అరుంధతి శ్రీకాంత్ గౌడ్ బోరును ఉపయోగంలోకి తీసుకువస్తానని ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం మరమత్తులు చేయించి చేతి పంపును బిగించారు. దీంతో వార్డు ప్రజలు అరుంధతి శ్రీకాంత్ గౌడ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిని వరుణ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు చిన్నపాక నరేందర్, మైసొల్ల వినోద్, కాలనీవాసులు హనుమంతు, మల్లేష్ పాల్గొన్నారు.

## జాతీయ బాలిక దినోత్సవం



**ప్రజాపక్షం/గుండాల;** జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని శనివారం గుండాల మండల పరిధిలోని అనంతారం, గుండాల జిల్లా పరిషత్ పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ సిడిపిఓ యామిని, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ యాక్‌పాషాబేగం జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి విద్యార్థినిలతో ప్రతిజ్ఞ చేయించి, ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో సిడిపిఓ శైలజ, బిఆర్‌బి కో ఆర్డినేటర్ అనంతలక్ష్మి , ప్రధానోధ్యాయులు చంద్రకళ, అండాలు, అంగన్వాడీ టీచర్లు సునిత, లక్ష్మి , జిల్లా సంక్షేమ కార్యాలయ సిబ్బంది, మహిళా సాధికారత టీం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆడపిల్ల దేశానికి గర్వకారణం




**ప్రజాపక్షం/నకిరేకల్ :** జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక నకిరేకల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నకిరేకల్ పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో అవగాహన కార్యక్రమం సమతా ఉపవిభాగం జిల్లా కమిటీ సభ్యురాలు వై.కోకిల అధ్యక్షతన నిర్వహించారు. బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, భద్రతపై చర్చించారు. డ్రాయింగ్, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ముఖ్య అతిధి డాక్టర్ శ్రీ భవ్య బహుమతులు అందించి, బాలికలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, సమత విభాగం బాధ్యులు అరుణ,శాలిని, సంధ్య, నూర్జహాన్, డివిజన్ కమిటీ బా ధ్యులు భద్రయ్య, నగేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండలంలోని గోవిందాపురం గ్రామంలోని, సెయింట్ విన్సెంట్ పల్లోటి హైస్కూల్లో బస్ క్లీనర్‌గా పనిచేస్తున్న అదే గ్రామానికి చెందిన కాటా జోజప్ప ఇటీవల అకస్మాత్తుగా మరణించడం జరిగింది. కాటా జోజప్ప నిరుపేద కుటుంబం కావడంతో, పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, యాజమాన్యం అందరూ కలిసి రూ.13000 అందజేశారు. ఈ సహాయం అందుకున్న కుటుంబ సభ్యులు, పిల్లలకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# టియుడబ్ల్యూజె (ఐజెయు) డైరీని ఆవిష్కరించిన కలెక్టర్

**-యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులకు అభినందనలు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** టియుడబ్ల్యూజె (ఐజెయు) జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర కమిటీ రూపొందించిన డైరీని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆవిష్కరించారు. శనివారం ఖమ్మంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్బంగా జర్నలిస్టుల సమస్యలపై కలెక్టర్ చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. నాయకులకు, జర్నలిస్టులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాం నారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్, సామినేని మురారి, జాతీయ కమిటీ సభ్యులు నలజాల వెంకట్రావు, జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మైసా పాపారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు మామిడాల భూపాల్, కార్యదర్శి మహేందర్, ఖమ్మం నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, నంచర్ల జనార్థానాచారి, జిల్లా కోశాధికారి నాగండ్ల శివానంద, జిల్లా నాయకులు యేగినాటి మాధవరావు, ఏలూరి వేణుగోపాలరావు, పసుపులేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# జైగౌడ జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వరరావుగౌడ్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సూర్యాపేట జిల్లా జైగౌడ ఉద్యమం జిల్లా అధ్యక్షునిగా హుజూర్నగర్ పట్టణానికి చెందిన కేశగాని నాగేశ్వరరావు గౌడ్‌ను నియమిస్తూ శనివారం జైగౌడ్ జాతీయ అధ్యక్షులు వట్టికూటి రామారావుగౌడ్, రాష్ట్ర అధ్యక్షులు గుండ్రాయితి నారాయణగౌడ్ లు సూర్యాపేట జిల్లా కార్యాలయంలో నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేశగాని నాగేశ్వరరావు గౌడ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జైగౌడ్ ఉద్యమాన్ని బలోపేతం చేస్తానని, గౌడ సమస్యలపై గౌడ్ హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తానని అన్నారు. నామీద నమ్మకంతో జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షులు వట్టికూటి రామారావు గౌడ్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ కేషగాని నరేష్ గౌడ్, తెలంగాణ మహిళ అధ్యక్షురాలు గాదగాని విమల, శ్రీనివాసగౌడ్ పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** చేనేత కార్మికుల రుణమాఫీ నిధులు విడుదల చేసిన సందర్బంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. శనివారం వీడియోస్ కాలనీలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నిధుల విడుదల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్బంగా రాష్ట్ర తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం అధ్యక్షులు, కార్పొరేటర్ కమర్తపు మురళీ మాట్లాడుతూ 2017 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు తీసుకున్న వ్యక్తిగత రుణాలకు, చేనేత కార్మికులను వడ్డీ వ్యాపారులు, మైక్రో ఫైనాన్స్ కంపెనీల ఒత్తిడి నుంచి విముక్తి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. పాత అప్పులు తీరడం ద్వారా బ్యాంకుల నుండి కొత్త అప్పులు పొందే అవకాశం కలిగిందన్నారు. కార్మికుల ఖాతాల్లో నేరుగా ఈ మాఫీ నిధులను జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్బంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, సాధు రమేష్‌రెడ్డి, నాయకులు తోట వీరభద్రం, పెండెం జనార్థన్, కుసుమ హన్మంతరావు, పులిపాటి సంపత్, చందా వీరభద్రం, జి. శ్రీనివాస్, కె. రమేష్, సంగిశెట్టి సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, బండారు శ్రీనివాస్, ప్రసన్నకృష్ణ, ఎన్. సతీష్, ఎం. శివ తదితరులు పాల్గొన్నారు.

# ఖుదాబక్ష్‌పల్లిలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/మర్రిగూడ :** మండలంలోని ఖుదాబక్ష్‌పల్లిలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనమాజీ జడ్‌పిటిసి పాశం సురేందర్ రెడ్డితో కలసి గ్రామ సర్పంచ్ పందుల జయలక్ష్మి పాండు గౌడ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్దే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. ఎస్‌సికాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు,బస్టాండ్ సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణం, జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో వికలాంగుల కోసం ప్రత్యేక టాయిలెట్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశయన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ప్రసన్న బాబు,హైస్కూల్ హెడ్‌మాస్టర్ రామ తులసి, ఉపసర్పంచ్ ఎస్‌కే షబ్బీర్,వార్డు సభ్యులు ఉరిపక్క రజిత జంగయ్య,అరగంటి అరుణ వెంకన్న,చింతల రామేశ్వరి నిరంజన్,మేతరి యాదయ్య,మైల్లారపు రాజు తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ గురుకులంలో 2026-27 అడ్మిషన్ల ప్రారంభం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** స్థానిక గుడిపాడు రోడ్డులోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం (ఎంపిసి, బైపిసి ఇంగ్లీష్ మీడియం) అడ్మిషన్ల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మట్టా రాగమయి దయానంద్ హాజరై ఆన్‌లైన్ అడ్మిషన్ ప్రక్రియను ప్రారంభించారు. అనంతరం మైనారిటీ పేద విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత వసతి, భోజనం, పుస్తకాలు వంటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా మైనారిటీ విద్యాసంస్థల సమన్వయ అధికారిణి అరుణకుమారి అడ్మిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ కే. వెంకట్రామయ్య మాట్లాడుతూ విద్యే అభ్యున్నతికి మార్గమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భారత గురుకుల విద్యా సంప్రదాయానికి ఉదాహరణగా నలంద విశ్వవిద్యాలయంను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి కే. సీతారాములు, ఏఎంసీ చైర్మన్ ఆనంద్, పట్టణ అధ్యక్షుడు గాదే చెన్నారావు, మైనారిటీ పెద్దలు కమల్ పాషా, మసీదు కమిటి చైర్మన్ రసూల్, మజీద్ ఉర్ రహమాన్ షేక్ రియాజ్ ,లక్కోజీ, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

# 31న సమీక్ష సమావేశం

**ప్రజాపక్షం/నాంపల్లి:** జిల్లా కలెక్టర్ మౌలిక ఆదేశాల మేరకు జనవరి 31న నాంపల్లి మండలంలోనీ 32 గ్రామపంచాయతీల సర్పంచులు,మండల అధికారులకు నాంపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష సమావేశము నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ శర్మ వెల్లడించారు. మండల పరిధిలోని మండల అధికారులు తమ శాఖలకు సంబంధించిన 40 పేజీల ప్రతులను జనవరి 30న ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

# పలు కుటుంబాలకు పరామర్శ

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.రాగమయి దయానంద్ శనివారం పలు కుటుంబాలను పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పొట్రూ రామారావుని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని, స్థానిక రాజకీయ పరిణామాలపై చర్చించారు.అనంతరం సత్తుపల్లి నియోజకవర్గం ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు సందీప్ గౌడ్ తండ్రి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా, ఆయనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి తదితరులున్నారు.

# అశ్వారావుపేట పురపోరులో గులాబీజెండా ఎగరవేయాలి



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** త్వరలో జరుగనున్న అశ్వారావుపేట పుర పోరులో గులాబీ జెండాను ఎగురవేయాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు పిలుపునిచ్చారు. శనివారం అశ్వారావుపేటలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అశ్వారావుపేట ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు, మాజీ ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు కలిసి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సైనికుల్లా పనిచేసి పార్టీని విజయపథంలో నడిపించాలని కోరారు. గత పదేళ్ల కేసిఆర్ పాలనలోనే అశ్వారావుపేట నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ఘోరంగా విఫలమైందని, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ బిఆర్ఎస్ పార్టీ గెలుపుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులే రాబోయే మున్సిపాల్టీ ఎన్నికల్లో పార్టీని గెలిపిస్తాయని అన్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలో 100పడకల ఆసుపత్రి, డిగ్రీ కళాశాల, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ వంటి పనులు ప్రజల్లో పార్టీపై నమ్మకాన్ని పెంచాయని వివరించారు. పార్టీ నిర్వహించిన అంతర్గత సర్వేల్లో అశ్వారావుపేట నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలిచిందని, త్వరలోనే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ఇక్కడ పర్యటించే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. బిఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉందని, కేసిఆర్ పాలనలోనే అభివృద్ధి చెందుతుందని ప్రజలు నమ్ముతున్నారని, త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికల విజయం కోసం కార్యకర్తలందరూ ఐకమత్యంతో పనిచేయాలని పిలపునిచ్చారు. నాయకల మధ్య సంపూర్ణ సమన్వయం ఉందని, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం నాయకులందరూ కలిసి ఇటీవల మృతి చెందిన కొల్లి కిరణ్ తండ్రి లాజర్ నివాసానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. లాజర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు ఆకుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం మున్సిపాల్టీ ఎన్నికల సన్నాహాకాల్లో భాగంగా చిక్కం గోపాల్‌కృష్ణ నివాసానికి వెళ్లి స్థానిక ఎన్నికల వ్యూహాలపై చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :**
అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని వేపకుంట్ల సర్పంచ్ పోట్లపల్లి రమాదేవి రాజా తెలిపారు. శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో ఈసిసిఈ కార్యక్రమంలో భాగంగా జరిగిన కార్యక్రమానికి సర్పంచ్ రమాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు పౌష్టికాహారంతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. వారి ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని ఆటపాటలతో విద్య నేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సర్పంచ్ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సర్పంచ్ తెలిపారు.

# రోడ్డు భద్రత అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలనందు రోడ్డు భద్రత అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా మధిర రూరల్ సిఐ డి.మధు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, వాటి నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం చేసి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకుని సంతోషంగా జీవించాలని అన్నారు.